
# విపక్షం బేజారు బీఆర్ఎస్ జోరు

- ఎన్నికల రంగంలోకి బీఆర్ఎస్ అభ్యర్థులు
- ముఖ్య నాయకులు, కార్యకర్తలతో నిత్యం సమావేశాలు
- కుమ్ములాటల్లో కాంగ్రెస్, పత్తా లేని బీజేపీ
- షెడ్యూల్ వచ్చినా ఆ పార్టీల్లో కానరాని హడావుడి




సూర్యాపేట, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ) : తొమ్మిదేండ్లు అధికారంలో ఉండి వేల కోట్ల రూపాయలతో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే తమ ధైర్యమని బీఆర్ఎస్ ధీమాతో ఉంది. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే అభ్యర్థులు ఖరారు కావడంతో ఇప్పటికే ఆయా నియోకవర్గాల్లో ఎమ్మెల్యేలు గ్రామాల్లో పర్యటిస్తూ ఓ విడుత ప్రచారం సైతం పూర్తి చేశారు. ప్రజలకు కావాల్సినవన్నీ ప్రభుత్వం సమకూర్చడంతో తొమ్మిదేండ్లలో పాలనలో ధర్నాలు, నిరసనలు అన్న మాటే లేదు. అన్నీ కాదు, అంతకుమించి అందుతుండడంతో ప్రజలంతా అధికార బీఆర్ఎస్‌కు జై కొడుతుండగా ప్రతిపక్షానికి పని లేకుండా పోయింది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడంతో బీఆర్ఎస్ అభ్యర్థులు సరుకు, సరంజామాలతో ఎన్నికల సమరశంఖంలోకి దూకుతుండగా ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీకి కుమ్ములాటలు, బీజేపీ అభ్యర్థుల కరువుతో విలవిల్లాడుతున్నాయి.

### ప్రతిపక్షాల్లో కనిపించని హడావిడి

సాధారణంగా ఎన్నికలు దగ్గరపడితే ఆయా రాజకీయ పార్టీలు ముందస్తుగానే సభలు, సమావేశాలు, అంతర్గత మీటింగులు, చేరికలు, పార్టీ జెండాలు, ప్రచార రథాలు సమకూర్చుకోవడం అంతా కోలాహలంగా ఉంటుంది. కానీ ఎందుకో ఈసారి ఎన్నికల కమిషన్ వారు ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినా అధికార బీఆర్ఎస్ పార్టీ మినహా విపక్షాల్లో రాజకీయాల హడావిడి కనీసం కనిపించడం లేదు. సూర్యాపేట జిల్లా విషయానికొస్తే తొమ్మిదేండ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి నేతృత్వంలో నాలుగు నియోకవర్గాలకు కలిపి సుమారు 25వేల కోట్లకు పైనే నిధులతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో ఐదారు జిల్లాలు కలిపి సైతం ఈ స్థాయిలో నిధులు అందలేదు. అలాంటిది వేల కోట్ల రూపాయలు మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాలకు ఖర్చు పెట్టామనే ధీమా, ప్రజలు సైతం గతంతో పోలిస్తే సంతోషంగా ఉండాలంటే బీఆర్ఎస్‌కే మద్దతు ఇవ్వాలనే పట్టుదలతో కనిపిస్తుండగా ఎమ్మెల్యేల్లో ఎనలేని గెలుపు ధీమా కనిపిస్తున్నది. ఇక జిల్లాలో ప్రతిపక్షాల తీరు దయనీయంగా కనిపిస్తుంది.

### కుమ్ములాటల్లో కాంగ్రెస్, పత్తా లేని బీజేపీ

అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎన్నికలకు ధీమాగా ఉండగా కొద్దిపాటి కాంగ్రెస్ పార్టీ కుమ్ములాటలతో కొట్టుమిట్టాడుతున్నది. బీజేపీ మచ్చుకు సైతం కనిపించడం లేదు. సూర్యాపేట కాంగ్రెస్ పార్టీలో రెండు వర్గాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి ఉంది. పార్టీ కార్యక్రమాలను వేర్వేరుగా చేస్తున్నారు. ఎవరికి టికెట్ వచ్చినా ఓటమి ఖాయం అవుతుందని ఆ నెపాన్ని మరో వర్గంపై నెట్టేందుకు ముందస్తుగానే ప్లాన్ చేసి పెట్టుకున్నట్లు ఆ పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. తుంగతుర్తి విషయానికి వస్తే ఇప్పటి వరకు తెరపైకి రాకపోగా... దాదాపు 10మందికి పైనే కాంగ్రెస్ పార్టీ నుంచి టిక్కెట్ ఆశిస్తూ ఎవరికి వారు గ్రూపులు కడుతున్నారు. కోదాడ కాంగ్రెస్ కుమ్ములాటలు హైదరాబాద్ గాంధీభవన్ వరకు వెళ్లి రాష్ట్రమంతా వినిపించిన విషయం విదితమే. హుజూర్‌నగర్‌లో అంతంత మాత్రంగా ఉన్న కాంగ్రెస్ గట్టెక్కడం కష్టమేనని ఇటీవల బీఆర్ఎస్‌లో చేరికలు... ప్రచారం చూసిన కాంగ్రెస్ నేతలే గుసగుసలాడుతున్నారు. మొత్తం మీద ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడంతో బీఆర్ఎస్ అభ్యర్థులు ఎన్నికల సమర శంఖారవంలోకి దూకగా ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీకి కుమ్ములాటలు, బీజేపీకి అభ్యర్థుల కరువుతో విలవిలలాడుతున్నాయి.

## వ్యవసాయ రంగానికి స్వామినాథన్ సేవలు మరువలేనివి

- అఖిల భారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి


సెమినార్‌లో మాట్లాడుతున్న సారంపల్లి మల్లారెడ్డి

బొడ్రాయిబజార్, అక్టోబర్ 12 : భారత వ్యవసాయ రంగ అభివృద్ధికి ఎం.ఎస్.స్వామినాథన్ చేసిన సేవలు మరువలేనివని అఖిల భారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి అన్నారు. స్థానిక ఎంవీఎన్ భవన్‌లో గురువారం 'భారత వ్యవసాయ రంగం–స్వామినాథన్ సిఫార్సులు 'అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. 2014–2018 ఎన్నికల సందర్భంగా బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే స్వామినాథన్ సిఫార్సులు అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన బీజేపీ వాటిని అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. దేశంలో మహిళా రైతుల అభ్యున్నతికి కుటుంబ స్త్రీ పథకం అమలు చేయాలని స్వామినాథన్ సిఫార్సు చేశారన్నారు. విత్తన ఏర్పాటు సంస్థగా భారతదేశం అభివృద్ధి కావాలని నిరంతరం అకాంక్షించారన్నారు. అంతకు ముందు స్వామినాథన్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభనాయక్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, బుర్రి శ్రీరాములు, పల్లె వెంకటరెడ్డి పాల్గొన్నారు.

### పౌష్టికాహార కిట్ల పంపిణీ


పౌష్టికాహార కిట్ల పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

మునుగోడు,అక్టోబర్12: లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ ఐకాన్ ఆధ్వర్యంలో మునుగోడు మండలంలో దత్తత తీసుకున్న 25 మంది టీబీ వ్యాధిగ్రస్తులకు ఐదో విడుత నిక్షయ మిత్ర పౌష్టికాహార కిట్లను స్థానిక పీహెచ్‌సీలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు గోపగోని యాదగిరి, రైస్ మిల్లర్స్ అసోసియేష న్ నల్లగొండ జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.నారాయణ, లయన్ కోడె సతీశ్, డాక్టర్ హజర్ హమ్మద్, నర్మద, మంగిబాయి, అజియ్ రెడ్డి, శ్రీనివాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



చిట్యాల : పట్టుబడిన నగదుతో ఎస్ఐ రవి

### తనిఖీలో రూ.50.61 లక్షలు సీజ్

నల్లగొండ సిటీ, అక్టోబర్ 12 : కనగల్ మండల కేంద్రంలో గురువారం తనిఖీ చేస్తుండగా ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.30 లక్షలు సీజ్ చేసినట్లు సీఐ వెంకటయ్య తెలిపారు. కనగల్–దేవరకొండ మార్గంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా గుర్రంపోడు ఎన్‌డీసీసీ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ తిరునగరి సతీశ్ కారులో డబ్బులను తరలిస్తుండగా వాటిని సీజ్ చేసినట్లు తెలిపారు. తనిఖీలో ఎస్ఐ అంతిరెడ్డి సిబ్బంది ఉన్నట్లు తెలిపారు.

- కొండమల్లేపల్లి : మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన తనిఖీల్లో ఎలాంటి ఆధారం లేకుండా నగదు తీసుకెళ్తున్న వ్యక్తి నుంచి రూ.68 వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వీరబాబు తెలిపారు. సదరు నగదును సీజ్ చేసి రెవెన్యూ అధి కారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.
- దామరచర్ల : వాడపల్లి చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ సందర్భంలో ఎలాంటి పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న రూ. 90 వేల నగదును పట్టుకున్నట్లు వాడపల్లి ఎస్ఐ రవికుమార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ వినుకొండ పట్టణానికి చెందిన పోకూరి శ్రీనివాస్‌రావు కారులో హైదరాబాద్‌కు డబ్బులతో వెళ్తుండగా స్వాధీనం చేసుకొని మిర్యాలగూడ రిటర్నింగ్ అధికారికి అప్పగించినట్లు పేర్కొన్నారు.
- నార్కట్‌పల్లి : నల్లగొండ ఎక్స్ రోడ్డు వద్ద ఎలాంటి ఆధారాలు లేకుండా చిన్నతుమ్మలగూడెం గ్రామానికి చెందిన యానాల నర్సిరెడ్డి వద్ద రూ.6లక్షలు, చిప్పలపల్లి గ్రామానికి చెందిన బల్లెం ఏశమ్మ వద్ద రూ.1.30 లక్షలు పోలీసులు పట్టుకున్నారు.
- చిట్యాల: చిట్యాలలో జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తుండగా విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న బస్సులో విజయనగరం జిల్లా సాలూరు గ్రామానికి బద్దుల నర్సింహ నాయుడు అనే డిగ్రీ విద్యార్థి రూ.1.53 లక్షల నగదును సీజ్ చేసినట్లు వివరించారు . నర్సింహనాయుడు హైదరాబాద్‌లో ప్రస్తుతం నివాసం ఉంటున్నాడు.
- రామన్నపేట :మండలకేంద్రంలో భువనగిరి వైపు నుంచి చిట్యాల వైపునకు వెళ్తున్న ఇన్నోవాలో నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న రూ. 1.20 లక్ష నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు. అలాగే మండలంలోని చిత్తాపురం గ్రామానికి చెందిన సత్యలక్ష్మి వద్ద రూ.9 లక్షల స్వాధీనం చేసుకుని ఎన్నికల అధికారులకు స్వాధీనం చేసినట్లు ఎస్ఐ చెప్పారు


ఎమ్మెల్యే చిరుమర్తికి మద్దతు తెలుపుతున్న ఇంద్రపాలనగరం మహిళలు

## కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా

- ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్/ రామన్నపేట, అక్టోబర్ 12 : ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. గురువారం మండలంలోని ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన మహిళలు సర్పంచ్ కాటేపల్లి సిద్దమ్మ, నకిరేకల్ పట్టణంలోని ముదిరాజ్ సంఘం నాయకులు, నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెం గ్రామ దండు కుటుంబ సభ్యులు, నకిరేకల్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను కలిసి ఆయనకు మద్దతుగా నిలుస్తామన్నారు. అలాగే నీర్నెంముల గ్రామానికి చెందిన సుర్వి సతీశ్ ఇటీవల మృతి చెందడంతో కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పోశబోయిన మల్లేశం, ఆత్మకమిటీ జిల్లా డైరక్టర్ ఆవుల నరేందర్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు గర్దాసు విక్రం, చలా సత్యప్రకాశ్, ఆవుల శ్రీధర్, చిప్పలపల్లి రవింద్రబాబు, నోముల శంకర్, ఆవుల మురళీధర్, సుర్వి శివ, బొజ్జ కోటమ్మ, రాస లలిత, బోనగిరి పద్మ, సుజాత, గుంజ లక్ష్మమ్మ, రసా వరమ్మ, సింగరావు అంతమ్మ, మండల అనిత, కొడితాల ధనమ్మ ఉన్నారు.

## స్వాములవారి లింగోటంలో పశువైద్య శిబిరం


పశువైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యాధికారులు

చౌటుప్పల రూరల్, అక్టోబర్ 12 : మండలంలోని స్వాములవారి లింగోటం గ్రామంలో పశుగణాభివృద్ధిసంస్థ ఆధ్వర్యంలో గురువారం గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సం దర్భంగా రైతులకు ఆయన పశువుల పెంపకంపై పలు సూచనలు చేశారు. పశువులకు వ్యాధు లు రాకుండా టీకాలు వేయించాలని తెలిపారు. శిబిరంలో 35 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు, 150 పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా ఈఓ పాశం శ్రీనివాస్, పశువైద్యాధికారులు డాక్టర్ పృథ్వీరాజ్, డాక్టర్ శ్రవణ్ కుమార్, గోపాల మిత్ర సూపర్‌వైజర్ గిరిబాబు, గోపాలమిత్రలు శ్రీనివాస్, వెంకటేశ్, శంకర్, మదనాచారి పాల్గొన్నారు.

## మునుగోడులో బీఆర్ఎస్‌దే విజయం

- మర్రిగూడ జడ్పీటీసీ పాశం సురేందర్ రెడ్డి

మర్రిగూడ, అక్టోబర్ 12 : కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన గ్యారెంటీ పథకాలను ప్రజలు నమ్మరని జిల్లా ఫైనాన్స్ కమిటీ మెంబర్, జడ్పీటీసీ పాశం సురేందర్ రెడ్డి అన్నారు. మండలంలోని ఖుదాభక్షపల్లిలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు.కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అమలు చేయని పథకాలు తెలంగాణలో అమలు చేస్తామని కాం గ్రెస్ నేతలు మోసపూరిత కుట్రలకు తెరలేపారన్నారు. మొన్న కర్ణాటకలో ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయంతో సంవత్సర కాలంలోనే వందల కోట్ల నిధులతో ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి జరిగిందని పేర్కొన్నారు. చిత్తశుద్ధితో ప్రజల కోసం పనిచేసే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డినే మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన కోరారు. ఆయన వెంట సర్పంచ్ ఆంబోతు సుధాకర్ నాయక్, ఉప సర్పంచ్ మైలారపు పార్వతమ్మాగిరేశ్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు పాండు గౌడ్, శేఖరయ్య ఉన్నారు.

### మూడోసారి బీఆర్ఎస్ గెలుపు ఖాయం

- చండూరు జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం

గట్టుప్పల్, అక్టోబర్ 12 : రానున్న ఎన్నికల్లో మూడో సారి బీఆర్ఎస్ ఖాయమని జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో గతంలో ఎన్నడూ జరగని విధంగా మునుగోడు నియోజకవర్గం అభివృద్ధి జరిగిందన్నారు. గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా సీఎం కేసీఆర్ కంకణం కట్టుకున్నారన్నారు. గట్టుప్పల్‌ను కొత్త మండలంగా ప్రకటించి ప్రజల ఆకాంక్షను నేరవేర్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. మూడోసారి బీఆర్ఎస్‌ను ప్రజలు ఆదరించి గెలిపించాలని కోరారు.